క్లుప్తంగా

పింఛన్ల పంపిణీలో మార్పులు

సఖినేటిపల్లి: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీలో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంపీడీఓ పీపీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. మే, జూన్ నెలల్లో గ్రామ సెక్రటేరియట్ల వద్ద ఎటువంటి పింఛన్ల పంపిణీ జరగదన్నారు. పింఛన్ల పంపిణీ ప్రధానంగా రెండు పద్ధతుల్లో జరుగుతుందన్నారు. డీబీటీ పద్ధతిలో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం, మరో విధానంలో దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మంచానికే పరిమితమైన వారు, సైనిక సంక్షేమ పింఛన్లు పొందే వారికి ఇంటి వద్దే నేరుగా సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తామన్నారు.

బ్యాంకు ఖాతా లేనివారికి ఇంటికే పింఛన్లు

మలికిపురం: మండలంలో బ్యాంకు ఖాతా సక్రమంగా లేని లబ్ధిదారులు 3,306 మందికి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికీ వచ్చి పింఛన్లు అందిస్తారని ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మొత్తం మండలంలో 10,786 మందికి గాను, 7,480 మందికి మే ఒకటో తేదీన బ్యాంకులో రూ.2.25 కోట్ల పింఛను నగదు జమ చేస్తామని చెప్పారు. మిగిలిన వారికి రూ.86.70 లక్షల నగదును సిబ్బంది ఇంటికి వచ్చి పింఛను ఇస్తారని తెలిపారు. పింఛను కోసం ఎవరూ పంచాయతీల వద్దకు రావొద్దని సూచించారు.

తాగునీటి సమస్యలపై కంట్రోల్ రూములు

సఖినేటిపల్లి: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో రాబోయే వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యల పరిష్కారానికి గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ పీపీ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కంట్రోల్ రూంలు జూన్ 15 వరకూ పనిచేస్తాయన్నారు. కాగా గ్రామాల్లో తాగునీటి సరఫరాలో వచ్చే సమస్యలను ఫోన్ ద్వారా కంట్రోల్ రూంకు తెలియజేస్తే, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. మండల స్థాయి కంట్రోల్ రూం 97046 68532, 97010 74663 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

మలికిపురం: అమలాపురానికి చెందిన మట్టపర్తి హరిణి కాలు ఆపరేషన్ కోసం రాజోలు దీవి కేంద్రంగా నిర్వహిస్తున్న గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ రూ.55 వేల ఆర్థికసాయాన్ని సమకూర్చింది. ఇటీవల ఓ రోడ్డు ప్రమాదంలో హరిణి కాలుకు తీవ్ర గాయమైంది. ఈ నేపథ్యంలో కాలు ఆపరేషన్ కోసం ఈ మొత్తాన్ని హరిణి తండ్రి పురుషోత్తమరావుకు సోమవారం అందజేశారు. సంస్థ సభ్యులు సమకూర్చిన విరాళాలు రూ.45 వేలు, అమలాపురానికి చెందిన మట్టపర్తి రవికుమార్ ఇచ్చిన రూ.10 వేలు మొత్తం రూ.55 వేలను అందించారు. కార్యక్రమంలో సంస్థ అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్, సభ్యులు కోట నాగరాజు, కట్టా శ్రీనివాస్, గుత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.


ఎండు గడ్డి వితరణ



అంతర్వేది గోశాలకు ట్రాక్టర్‌పై తరలించిన ఎండు గడ్డి

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని గోశాలకు సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలానికి చెందిన కోడూరు వెంకట శివనారాయణ, లక్ష్మి దంపతులు ట్రాక్టర్ ఎండు గడ్డిని వితరణ చేశారు. దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సమక్షంలో దీనిని గోశాలకు చేర్చారు. కార్యక్రమంలో గోశాల సిబ్బంది, స్వామివారి సేవా సమితి భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థిని సౌమ్యశ్రీకి నగదు బహుమతి



సౌమ్యశ్రీకి బహుమతి అందజేస్తున్న వెంకటరత్నం

అంబాజీపేట: పదో తరగతి పరీక్షల్లో 554 మార్కులు సాధించిన పుల్లేటికుర్రుకు చెందిన నక్కా సౌమ్యశ్రీకి సరెళ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. ట్రస్ట్ కన్వీనర్ వెంకటరత్నం సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకాన్ని సౌమ్యశ్రీకి అందజేశారు. కార్యక్రమంలో బీఎస్‌పీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన మందపాటి కిరణ్‌కుమార్, అనితా శుభజ్యోతి దంపతులు



అంబాజీపేటలో బహిరంగ సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అందరికీ సంక్షేమ ఫలాలు

- జగనన్న సారథ్యంలో అన్ని వర్గాలకూ సమాన అభివృద్ధి
- ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వేణుగోపాలరావు, రాపాక

అంబాజీపేట/మామిడికుదురు: అన్ని వర్గాలకూ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. అంబాజీపేట ఆర్టీసీ బస్టాండ్ రోడ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి, గత ఐదేళ్లలో ప్రతి పేదవాడికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడికి పారదర్శకంగా ప్రభుత్వ ఫలాలు ఇంటి వద్దనే వలంటీర్ల ద్వారా అందించారని గుర్తు చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా దాళ్వా పంటకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందించారన్నారు. గోదావరి వరదలకు తీర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడకుండా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పి.గన్నవరం మండలం ఊడిమూడి లంక వంతెన నిర్మాణాన్ని రూ.63 కోట్లతో చేపట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. విద్యా దీవెన ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే కాకుండా, ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టారని చెప్పారు. కాపు కార్పొరేషన్ గతంలో ఉన్నప్పటికీ వాటిని టీడీపీ పెద్దలు, జన్మభూమి కమిటీ వారు మాత్రమే పంచుకునేవారన్నారు. అర్హులైన కాపులకు ఒక్క రూపాయి అందకుండా చేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రతి కాపు కుటుంబంలో 45 నుంచి 60 ఏళ్లున్న మహిళలకు కాపునేస్తం ద్వారా ప్రతి ఏటా రూ.15 వేల సాయం అందజేస్తున్నారన్నారు. వైశ్యులు, బ్రాహ్మణులు, క్షత్రియులకు ఈబీసీ నేస్తం ద్వారా ప్రతి ఏటా రూ.15 వేలు అందిస్తున్నారని చెప్పారు. జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకుందామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి, జనరంజక పాలన సాగించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, ఎంపీపీలు దొమ్మేటి వెంకటేశ్వరరావు, మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, పార్టీ నేతలు దొమ్మేటి సత్యమోహన్, మంతెన రవిరాజు, పేరి శ్రీనివాస్, ముత్తాబత్తుల ప్రశాంత్, కొర్లపాటి కోటబాబు, ఉందుర్తి నాగబాబు, నక్కా వెంకటేశ్వరరావు, దొమ్మేటి వెంకటశివరామన్, అడ్డగళ్ల వెంకటసాయిరామ్, పితాని నర్సింహరావు, యన్నాబత్తుల ఆనంద్, తోలేటి బంగారునాయుడు, కొమ్ముల రాము, మట్టపర్తి శివ, నెల్లి దుర్గాప్రసాద్, బొలిశెట్టి భగవాన్, తోరం భాస్కర్, జక్కంపూడి వాసు, గెడ్డం వెంకటేశ్వరరావు, చిట్టూరి రామకృష్ణ, రాష్ట్ర నాయకులు పీకే రావు, చెల్లుబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన బొంతు రాజేశ్వరరావు, నేలపూడి స్టాలిన్‌బాబు

అసెంబ్లీ బరిలో అభ్యర్థులు వీరే..

కొత్తపేట: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ మేరకు ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి జీవీవీ సత్యనారాయణ సోమవారం రాత్రి అభ్యర్థులు, వారికి కేటాయించిన గుర్తుల వివరాలను మీడియాకు విడుదల చేశారు. అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. ఈశ్వరరావు రౌతు(కాంగ్రెస్), కాంద్రు వెంకటేశ్వరరావు (బీఎస్పీ), చిర్ల జగ్గిరెడ్డి (వైఎస్సార్ సీపీ), బండారు సత్యానందరావు (టీడీపీ) ఉన్నారు. ఇంకా జై భారత్ నేషనల్, లిబరేషన్ కాంగ్రెస్, నవరంగ్ కాంగ్రెస్‌తో పాటు, ఆరుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు బరిలో నిలిచారు.

రాజోలు బరిలో పది

రాజోలు: నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల బరిలో పది మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఆర్ఓ, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ వారికి గుర్తులు కేటాయించారు. మొత్తం 15 మంది నామినేషన్లు దాఖలు చేయగా, 11 అనుమతించారు. ఒకరు నామినేషన్ ఉపసంహరించుకోవడంతో, పది మంది పోటీలో ఉన్నారు. వీరిలో గొల్లపల్లి సూర్యారావు(వైఎస్సార్ సీపీ), పులపకూర లిలినీ ఆశారాణి(బీఎస్పీ), సరెళ్ల ప్రసన్నకుమార్ (కాంగ్రెస్), దేవ వరప్రసాద్ (జనసేన) ఉన్నారు. ఇంకా పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, జాతీయ జనసేన అభ్యర్థులతో పాటు, నలుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు.

పి.గన్నవరంలో 14 మంది..

పి.గన్నవరం: నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ బరిలో 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు ఆర్ఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. మొత్తం 17 మంది నామినేషన్లు వేయగా, రెండింటిని తిరస్కరించారు. సోమవారం గిడ్డి అనందరావు నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం బరిలో కొల్లాబత్తుల సత్యనారాయణ (బీఎస్పీ), కొండేటి చిట్టిబాబు(కాంగ్రెస్), విప్పర్తి వేణుగోపాలరావు(వైఎస్సార్ సీపీ), గిడ్డి సత్యనారాయణ (జనసేన) ఉన్నారు. ఇంకా పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ, లిబరేషన్ కాంగ్రెస్, జై భారత్ నేషనల్ పార్టీ, నవరంగ్ కాంగ్రెస్, జాతీయ జనసేనతో పాటు నలుగురు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు.

జగన్ సభకు తరలిన నాయకులు

అయినవిల్లి: అంబాజీపేటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు అయినవిల్లి మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు భారీ ఎత్తున తరలివెళ్లారు. మోటార్ సైకిళ్లపై ర్యాలీగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నినాదాలు చేస్తూ వెళ్లారు. పార్టీ మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు తదితరులున్నారు.

భారీగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

మలికిపురం: అంబాజీపేటలో జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మలికిపురంలోని పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వివిధ గ్రామాల నుంచి సోమవారం ఉదయం మోటార్ బైక్‌లపై మలికిపురం చేరుకున్న పార్టీ కార్యకర్తలు ర్యాలీగా అంబాజీపేటకు బయలుదేరారు. అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లారు. సుమారు ఐదు వేల మంది కార్యకర్తలకు గొల్లపల్లి సూర్యారావు తన ఇంటి వద్ద భోజన ఏర్పాట్లు చేశారు.



నల్లచెరువు గ్రామం నుంచి తరలిన పార్టీ నాయకులు

మేనిఫెస్టో అమలు చేసే ఏకైక సీఎం జగన్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేతలు

కొత్తపేట: ఎన్నికల మేనిఫెస్టోను, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసే ఏకైక నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ప్రజలు నమ్ముతున్నారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ముసునూరి వెంకటేశ్వరరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, సేవాదళ్ మండల అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్ సోమవారం కొత్తపేటలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలే కాక, ఇవ్వని హామీలు కూడా అమలు చేసిన ఘనత రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2014 ఎన్నికల్లో నోటికొచ్చిన హామీలు ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు, తీరా అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మళ్లీ 2019 ఎన్నికల ముందు పసుపు-కుంకుమ పేరుతో రూ.పది వేలు ఇచ్చి చేతులు దులుపుకోగా, ప్రజలు ఆ పార్టీని చిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో నవరత్నాలతో పాటు, అనేక సంక్షేమ పథకాలకు హామీ ఇచ్చి, అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే అన్నీ అమలు చేశారన్నారు. తద్వారా ప్రజా విశ్వాసం చూరగొన్నారన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. చంద్రబాబు మళ్లీ ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మడం లేదని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలను కొనసాగిస్తూ, అమ్మఒడి, రైతు భరోసా, పింఛను కానుక వంటి పథకాల మొత్తం పెంచడంతో పాటు, విద్య, వైద్య రంగాలకు అత్యధిక నిధులు కేటాయించనున్నట్టు తెలిపారు. దీంతో ప్రజా విశ్వాసం వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. తమ పార్టీ ఘన విజయం సాధిస్తుందని, కూటమి పార్టీలకు పరాభవం తప్పదన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర పురోగతి

- పేదల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట
- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రచారానికి ప్రజల్లో అపూర్వ ఆదరణ

ఆలమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీని ప్రజలు మరోసారి అధికారంలోకి తీసుకువస్తే.. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించేందుకు ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మడికి, చిలకలపాడు, మల్లవానితోట గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారానికి అపూర్వ స్పందన లభించింది. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ ఉండ్రాసపు లక్ష్మీమౌనిక, ఉప సర్పంచ్ పడమట సుజాత, సీనియర్ నేత చెల్లుబోయిన శ్రీనివాసు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించగా, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తీన్‌మార్, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి, తిలకాలు దిద్ది ఆశీర్వదించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వీధి వీధినా పర్యటించి ప్రభుత్వ అభివృద్ధి పనులను వివరించారు. తమ కుటుంబాలకు మంచి జరిగితేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. వృద్ధులు, దివ్యాంగులు తదితరులు జగ్గిరెడ్డిని ఆప్యాయంగా పలకరించి, ఇంటి వద్దకే పింఛన్లను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



మడికిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

అందరికీ సంతృప్తి

గత ఐదేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల అందరికీ లబ్ధి చేకూరిందని, మహిళలందరూ ఆర్థిక స్వావలంబన సాధించారని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేర్కొన్నారు. పేదల పక్షపాతి, సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో ఓడించాలనే ఏకైక లక్ష్యంతో చంద్రబాబు అనైతిక కూటమిని ఏర్పాటు చేసి, ఆచరణ సాధ్యం కాని హామీలిస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రావులమ్మ జాతర



గ్రామ దేవత రావులమ్మవారు

అయినవిల్లి: గ్రామదేవత రావులమ్మ వారికి సోమవారం రాత్రి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. భక్తులు చలివిడి వడపప్పు, బెల్లం పానకం, అరటి పండ్లు నైవేద్యంగా సమర్పించారు. మంగళవారం భారీఎత్తున తీర్థ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

వివాహిత అదృశ్యం



నాగమణి(ఫైల్)

రావులపాలెం: కుటుంబ గొడవల నేపథ్యంలో ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు సమీప బంధువు ఇచ్చిన ఫిర్యాదుపై రావులపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాళ్లకూరి నాగమణి, నారాయణమూర్తి దంపతులు కుటుంబ గొడవల నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. అయితే సాయంత్రానికి నాగమణి తిరిగి రాకపోవడంతో, ఆమె సమీప బంధువు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ రాంబాబు తెలిపారు.

వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ప్రజాదరణ



వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న గొల్లపల్లి సూర్యారావు తదితరులు

రాజోలు: రోజురోజుకూ వైఎస్సార్ సీపీకి ప్రజాదరణ పెరుగుతోందని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం తాటిపాక గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు చుట్టుగుళ్ల నాగమల్లేశ్వరరావుతో పాటు, పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, పార్టీ నాయకుడు కేఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో జనసేన, టీడీపీకి చెందిన పలువురు పార్టీలోకి వచ్చారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు అన్ని కుటుంబాలకూ అందాయన్నారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మెడబల రాజ్‌కుమార్, పార్టీ నాయకులు మద్దుల కాసు, బొంతు రమేష్, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో చలివేంద్రం ఏర్పాటు

రాజోలు: రాజోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు ప్రారంభించారు. వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో కోర్టుకు వచ్చే కక్షిదారులకు మజ్జిగ అందించేందుకు బార్ అసోసియేషన్ చేస్తున్న సేవలను వారు అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడిశెట్టి సాయిబాబు, గొల్లమందల స్టాలిన్, సీనియర్ న్యాయవాదులు పీవీ కృష్ణంరాజు, పొన్నాడ సూర్యారావు, ఆకుల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో మజ్జిగ అందిస్తున్న న్యాయమూర్తులు ప్రమీలారాణి, హిమబిందు

కర్బలా యాత్రకు ముస్లింల బృందం



కర్బలా యాత్రకు పయనమైన ముస్లింల బృందం

మామిడికుదురు: ఇరాక్ దేశంలోని కర్బలా పుణ్యక్షేత్రాల సందర్శనకు మామిడికుదురు మండలం నుంచి 26 మంది ముస్లింల బృందం సోమవారం పయనమైంది. మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజా నుంచి నగరం పంజీషా వరకు ముస్లిం బృందం పాదయాత్రగా వెళ్లింది. అక్కడ పంజీషాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇరాన్, ఇరాక్, సిరియా దేశాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఈ బృందం సందర్శిస్తుంది.

రూ.ఆరు కోట్ల విలువైన బంగారం, వెండి సీజ్

చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న ఎస్ఎస్‌టీ బృందం

రావులపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై గోపాలపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం అధికారులు సుమారు రూ.6 కోట్ల విలువైన బంగారం, వెండి వస్తువులను సీజ్ చేశారు. ఎస్ఎస్‌టీ బృందం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి అమలాపురం వైపు బీవీసీ లాజిస్టిక్స్ కంపెనీకి చెందిన వ్యాన్‌లో వెండి, బంగారం వస్తువులను తరలిస్తున్నారు. ఆ వాహనానికి ఎన్నికల కమిషన్ అనుమతులు లేకపోవడంతో అధికారులు సీజ్ చేశారు. వాహనంలో ఉన్న బిల్లుల ఆధారంగా సుమారు 20 కేజీల 313 గ్రాముల వెండి వస్తువులు, 9 కేజీల 312 గ్రాముల బంగారు వస్తువులున్నట్టు గుర్తించారు. అనుమతులు లేని కారణంగా వ్యాన్‌ను సీజ్ చేసినట్టు టీం ఇన్‌చార్జి, రావులపాడు పంచాయతీ సెక్రటరీ ఎం.పట్టాభి సీతారామయ్య తెలిపారు. మొత్తం వస్తువుల విలువ రూ.6,65,07,212గా గుర్తించామన్నారు. వ్యాన్‌ను ఉన్నతాధికారుల అనుమతితో తెరిచేందుకు ఆర్డీఓ కార్యాలయానికి తరలించినట్టు తెలిపారు. తనిఖీల్లో రావులపాలెం సీఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలపురం చెక్‌పోస్టు వద్ద అధికారులు సీజ్ చేసిన వ్యాన్

తైక్వాండోలో కలవచర్ల విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు: కలవచర్లకు చెందిన తైక్వాండో విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభను కనబర్చారు. ఇటీవల కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. సబ్ జూనియర్ బాయ్స్ 30 కేజీల విభాగంలో పాలెపు మోక్ష వెంకట్, 35 కేజీల్లో వడ్డి కార్తికేయ, బాలికల 20 కేజీల్లో పాలెపు లాస్య, జూనియర్ బాయ్స్ 40 కేజీల్లో గెద్దాడ జాయ్ కిరణ్ వెండి పతకాలు సాధించారు. క్యాడ్ బాలికల్లో వడ్డి గిరిజ బ్రాంజ్ మెడల్ సాధించింది. జూనియర్స్‌లో మెరిపే సత్యకాంత్ గోల్డ్ మెడల్ సాధించినట్టు మాస్టర్ టి.అబ్బులు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ గౌరవాధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు సీనియర్ మాస్టర్ డి.వెంకటలక్ష్మి, కోచ్‌లు టి.కిరణ్, ఎం.సత్యకాంత్ తదితరులు వారిని అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రతినిధులు